www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 13 జనవరి 2025



పోలీసులకు బకాయిల చెల్లింపు పై హర్షం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పోలీసు ఉద్యోగులకి సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్న 2024 జనవరి నెలకు సంబంధించిన అడిషనల్ సరెండర్ లీవ్ బకాయిలు, జూన్ వరకు సప్లమెంటరీ సరెండర్ లీవ్ బిల్స్, జి.పి.ఎఫ్ , సిపిఎస్ ఉద్యోగుల బకాయిలను వెంటనే మంజూరు చేసేలా ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పోలీసు అధికారుల సంఘం, చిత్తూరు జిల్లా శాఖ ఆదివారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు. సరెండర్ లీవుల బకాయిల మంజూరుతో పోలీసు కుటుంబాలలో సంక్రాంతి పండగ ముందుగా వచ్చిందని ఎంతో ఆనందంగా ఉందని పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు ఉదయ్ కుమార్ తెలియజేశారు.

కాలుష్యరహిత ఇంధన వాడకం ప్రోత్సహిద్దాం

ప్రజాశక్తి- తిరుపతి సిటి, రామచంద్రాపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్లీన్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా దిద్దుతామని, కాలుష్యరహిత ఇంధన వాడకం ప్రోత్సహిద్దామని, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా అందేలా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక తిరుపతి హోటల్ తాజ్ నందు ఎజీ అండ్ పి ప్రథమ్ - థింక్ గ్యాస్ వారిచే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ముందుగా సిఎన్జి వాహనాల ర్యాలీని జెండా ఊపి ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం జపనీస్ పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. అనంతరం ఏజీ ఎంపీ అండ్ పి ప్రథమ్ -థింక్ గ్యాస్ వారు ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇంధన రంగంలో దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ సంస్థల్లో ఒకటైన ఏజీ అండ్ పి మరింతగా తమ వాణిజ్య కార్యకపాపాలను విసరిస్తున్నందుకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. తను తిరుచానూరులో ఏజీ అండ్ పి ప్రథం థింక్ గ్యాస్ వారి ద్వారా డైరెక్ట్ పైపులైన్ ద్వారా గ్యాస్ అందించే కార్యక్రమ శ్రీకారం చుట్టి వారితో మాట్లాడానని అన్నారు. తిరుచానూరులో వినియోగదారుడి ఇంట్లో ఎజి అండ్‌పి గ్యాస్ కనెక్షన్‌ను ప్రారంభి గ్యాస్ స్టవ్ ఆన్ చేరి సిఎం స్వయంగా టీ తయారుచేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జిల్లా అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పారిశ్రామిక వేత్తల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



గ్యాస్ వినియోగదారుడి ఇంట్లో టీ పెడ్డుతున్న సిఎం

నారావారిపల్లెకు చేరుకున్న చంద్రబాబు, లోకేష్


సంక్రాంతి పండుగను సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్ కుటుంబసభ్యులు స్వగ్రామమైన నారావారిపల్లెలో జరుపుకునేందుకు ఆదివారం రాత్రి 7.30 గంటలకు నారావారిపల్లెకు చేరుకున్నారు. నారావారిపల్లెలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, స్థానిక ఎమ్మెల్యే పులివర్తి వెంకటమణి ప్రసాద్ (నాని) టిడిపి నాయకులు, గ్రామస్తులు కర్పూర హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. మంత్రి నారా లోకేష్ ఉదయం 11.30 గంటలకు నారావారిపల్లెకు చేరుకున్నారు. నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ కుటుంబ సభ్యులు నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి, నారా దేవాన్సులు సంక్రాంతి పండుగకు స్వగహానికి చేరుకోవడంతో తిరుపతి ఇన్చార్జి ఎస్పీ మణికంఠ చందోలు నారావారిపల్లెలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నారావారిపల్లెకి నారా కుటుంబ సభ్యులు చేరుకోవడంతో సంక్రాంతి సందడి నెలకొంది. సోమవారం వేకువ జామున చంద్రబాబు కుటుంబసభ్యులు వారి ఇంటి ముందు భోగి మంటలు వేయనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులు మూడు రోజుల పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు.

శేషాచల లింగేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి లోకేష్, నారా భువనేశ్వరి


నారావారిపల్లి సమీపంలో ఉన్న శేషాపురం గ్రామంలో వెలసిన శ్రీశేషాచల లింగేశ్వర స్వామిని ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, నారా భువనేశ్వరి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక టిడిపి నాయకులు రాకేష్ చౌదరి, ప్రతాప్ నాయుడు, ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం ఏర్పాట్లను చేశారు. వేదపండితులు వారికి వేద ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

విమానాశ్రయంలో ముఖ్యమంత్రి ఘన స్వాగతం

తిరుపతి జిల్లా పర్యటనకు ఆదివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సాదర స్వాగతం లభించింది. సీఎంకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, టిటిడి చైర్మన్ బిఆర్. నాయుడు, డీఐజీ షిమోషి బాజ్పాయ్, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాద్ రావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఇంచార్జి జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, రాష్ట్ర నాయిబ్రాహ్మణ చైర్మన్ సాదాశివం, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, తిరుపతి, నగరి, గంగాధర్ నెల్లూరు, ఎమ్మెల్యేలు పులివర్తి వెంకట ముని ప్రసాద్(నాని) బొజ్జల సుధీర్ రెడ్డి, కోనేటి ఆదిమూలం, అరణి శ్రీనివాసులు, భానుప్రకాష్, డాక్టర్ వి.యం థామస్, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర పట్టణ అభివద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఉన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుపతికి రోడ్డు మార్గాన బయలుదేరారు.



విమానాశ్రయంలో సిఎంను కలిసిన టిటిడి ఛైర్మన్



నారావారిపల్లెలో సిఎంతో కలెక్టర్, ఎమ్మెల్యే నాని

కంకర పరిచారు.. తారు మరిచారు..

ప్యాచ్ వర్క్ పనులు పూర్తికాక అవస్థలు పడుతున్న వాహనదారులు



నేడు కంకర పరిచి ఉన్న దృశ్యం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల నుంచి నంజంపేట మీదుగా పెద్ద ఉప్పరపల్లి వరకు గుంతలమయమై అధ్వానంగా తయారైన ప్రధాన రహదారికి ప్యాచ్‌వర్క్ పనులు ప్రారంభించి అర్ధాంతరంగా నిలిపివేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సోమల నుండి నంజంపేట మీదుగా పెద్ద ఉప్పరపల్లికు 15 కిలోమీటర్లకు పైగా దూరం ఉంది. మూడు సంవత్సరాలుగా 15 కిలోమీటర్ల దూరం గుంతలు ఏర్పడి వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అసౌకర్యంగా మారింది. నూతన కూటమి ప్రభుత్వం సంక్రాంతి పండుగ లోపు రోడ్లపై గుంతలను పూడ్చివేసి ప్యాచ్‌వర్క్ చేస్తామని తెలపడంతో 15 కిలోమీటర్ల మార్గం గుంతలు లేకుండా మంచి రోడ్డుగా తయారవుతుందని వాహనదారులు ఎంతో ఆశపడ్డారు. అయితే గుంతలలో కంకర పోసి రోడ్డులో రోలర్ ద్వారా తొక్కించి ఆ తర్వాత పనులు చేయకపోవడం, కంకర పరిచిన చోట తారు వేయకపోవడంతో సంక్రాంతి పండుగకు వచ్చిన బంధువులు కుటుంబ సభ్యులు కంకర రోడ్డుపైనే ఇండ్లకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కంకర రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు రోడ్డు స్లిప్పయి రోడ్డుపై పడుతూ గాయాల పాలవుతున్న సందర్భాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు బాగుపడుతుందని ఆశించిన ఈ ప్రాంత ప్రజలకు వాహనదారులకు నిరాసే మిగిలింది. ఇకనైనా కంకర పరచిన ప్రాంతాలలో చిన్నచిన్న గుంతలు ఉన్న ప్రాంతాలలో తారు రోడ్డు వేసి ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేసి వాహనదారులు ప్రజలు సజావుగా రోడ్డుపై ప్రయాణించే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



నాడు గుంతలమయంగా ఉన్న ప్రాంతం

టీటీడీ ఇన్చార్జి చీఫ్ విజిలెన్స్ అండ్

సెక్యూరిటీ ఆఫీసర్‌గా మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం ఇన్‌ఛార్జ్ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా చిత్తూరు జిల్లా ఎస్పీ విఎన్. మణికంఠ చందోలు ఆదివారం మధ్యాహ్నం తిరుపతి తిరుమల దేవస్థానం పరిపాలన భవనంలో బాధ్యతలు తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు చిత్తూరు జిల్లా ఎస్పీ విఎన్. మణికంఠ చందోలు ఇన్‌ఛార్జ్ టిటిడి చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు

తెలుగు లోగిళ్లలో.. ప్రతి ఇంటా ఆనందాల సిరులు వెల్లివిరియాలి

మంత్రి రాం ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తెలుగు ప్రజలందరికి మకర సంక్రాంతి శుభాకాంక్షలు అని జిల్లా ఇన్చార్జ్ మంత్రి, రాష్ట్ర రవాణా యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ప్రభుత్వ విప్, జీడి నెల్లూరు శాసనసభ్యులు విఎం.థామస్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డిఆర్ఓ మోహన్ కుమార్ తెలిపారు. జిల్లా ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మన సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించే అచ్చ తెలుగు పండుగ సంక్రాంతి అని, భోగి మంటలు, రంగ వల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్లు, పైరు పచ్చల కళకళలు గ్రామాల్లో సంక్రాంతి శోభను, భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ మకర సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాల్లో మరింత ప్రగతితో కూడిన మార్పును తీసుకురావాలని, తెలుగు లోగిళ్లలో.. ప్రతి ఇంటా ఆనందాల సిరులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

అభివృద్ధి కోసమే గోకులం షెడ్లు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఐరాల : మండలంలోని చిగరపల్లె గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రాయితీపై రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్లను పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ ఆదివారం ప్రారంభించారు. చిగరపల్లె గ్రామానికి చెందిన రైతు రాజేంద్రన్ నిర్మించిన గోకులం షెడ్లను ఎమ్మెల్యే సందర్శించి గోకులం షెడ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని రైతులతో ఆయన ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు, పశువుల సంక్షేమమే ధ్యేయంగా గ్రామాల్లోని రైతులకు గోకులం షెడ్లను రాయితీపై అందిస్తోందన్నారు. ఐరాల మండలంలో మొత్తం 82 గోకులం షెడ్లు మంజూరు చేయగా, అందులో ప్రస్తుతం 42 గోకులం షెడ్లు పూర్తి అయ్యాయని, మిగిలిన షెడ్లు త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. మండల అధ్యక్షులు గిరిధర్ బాబు, నియోజకవర్గం ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం, కాణిపాకం దేవస్థానం మాజీ ఛైర్మన్ మణినాయుడు, లతా బాబు నాయుడు, దేవాజీ, ఏపివో సంధ్యారాణి, పంచాయతీ సెక్రటరీ మౌనిక, వెటర్నరీ వైద్యులు గీతారెడ్డి పాల్గొన్నారు.



గోకులం షెడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకం

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుధారాణి

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టవ్యతిరేకం అయినా ఆడపిల్లల్ని పిండస్థ దశలోనే చిదిమేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో వెయ్యి మంది పురుషులకు 892 మంది ఆడశిశువులు మాత్రమే ఉన్నారు. స్త్రీ నిష్పత్తి రోజురోజుకు తగ్గుతోంది. ప్రభుత్వం ఆడ శిశువులను కాపాడలంటూ పిసిపిఎన్‌డిటి చట్టం తీసుకొచ్చినా చాటుమాటుగా స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌ల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు అక్కడక్కడా వెలుగులోకి వస్తున్నాయి. నిబంధనలు పాటించకుండా చట్ట వ్యతిరేకంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై కఠిన శిక్షలు తప్పవు. ఈ దిశగా జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని అప్రమత్తం చేయడం జరిగింది. పోలీస్, ఐసిడిఎస్, సచివాలయ సిబ్బంది ద్వారా పిసిపిఎన్‌డిటి చట్టం అమలుపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం. ఈ మేరకు రెండు రోజుల క్రితం గెజిట్ విడుదల చేయడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ సుధారాణి తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో పిసిపిఎన్‌డిటి చట్టం అమలుపై తీసుకోనున్న చర్యలను వివరించారు.

ప్రజాశక్తి: ప్రస్తుతం జిల్లాలో ఆడ-మగ రేషియో ఎంత ఉంది..?

డిఎఅండ్‌హెచ్‌ఒ: జిల్లాలో వెయ్యి మంది మగ శిశువులకు 892 మంది ఆడశిశులున్నారు. ఆడ శిశువుల రేషియోను పెంచేందుకు పిసిపిఎన్‌డిటి చట్టాన్ని ప్రతిష్టంగా అమలు చేస్తున్నాం.

ప్రజాశక్తి : పిసిపిఎన్‌డిటి చట్టం అమలు ఏఏ శాఖల ద్వారా చేపడుతున్నారు..?

డిఎఅండ్ హెచ్‌ఒ: జిల్లాలో పిసిపిఎన్‌డిటి చట్టంను పటిష్టంగా అమలు చేయడానికి న్యాయశాఖ, పోలీసు శాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించడం జరిగింది. ఎవరైన చట్టవిరుద్ధమైన కార్యకలాపాలైన లింగనిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలకు పాల్పడితే చట్టపరమైన, న్యాయపరమైన శిక్షలు అమలు చేయాలని ఆదేశించాం. వైద్య, ఆరోగ్యశాఖ అలాగే పోలీసు, విజిలెన్స్ శాఖవారు గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచుతున్నాం.

ప్రజాశక్తి : లింగ నిర్ధారణ చట్టంపై క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రచారం చేస్తున్నారు?

డిఎఅండ్ హెచ్‌ఒ: పిసిపిఎన్‌డిటి చట్టంను ఖచ్చితంగా అమలు చేసి జిల్లాలో లింగ నిష్పత్తిని సమాన స్థాయికి తీసుకొచ్చేందుకు పోలీసు శాఖ తరపున క్షేత్రస్థాయిలో మహిళా పోలీసు కార్యదర్శుల ద్వారా చట్టంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి బృందాల ద్వారా డివిజినల్ స్థాయి బృందాల ద్వారా నెలకు 20 తనిఖీలు, 20 డెకాయి ఆపరేషన్లు తప్పక చేయాలని కమిటీ సభ్యులు నిర్ణయించాం.

ప్రజాశక్తి : స్కానింగ్ సెంటర్లు ఎలాంటి అనుమతులు పొందాలి?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వారి వద్ద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలి. ఎవరైన అనుమతులు లేకుండా స్కానింగ్ కేంద్రాలను నడిపితే ఆ స్కానింగ్ సెంటర్లను గుర్తించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది. స్కానింగ్ కేంద్రాలను నిర్దేశించబడిన షెడ్యూల్ ప్రకారం సందర్శించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుచున్న స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు చేపడుతున్నాం.

ప్రజాశక్తి : లింగ నిర్ధారణ, భ్రూణహత్యల నివారణకు చేపడుతున్న చర్యలు ఏమిటి..?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: లింగ నిర్ధరాణ చేస్తున్నట్లు తెలిస్తే ఎవరైనా సంబంధిత స్కానింగ్ సెంటర్‌పై ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. అలాగే గర్భస్థ పిండ లింగ నిర్ధారణ, భ్రూణహత్యలకు పాల్పడుతున్న వారిపై సెక్షన్ 23, 24, 25 కింద కేసు నమోదు చేసి జరిమానాలు విధించి, శిక్షలు అమలు చేయడం జరుగుతుంది. తక్కువ లింగ నిష్పత్తి ఉన్న మండలాల్లో విస్తృతంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ప్రజలలో ఉన్న మూఢనమ్మకాలను పారద్రోలి ఆడ మగ తేడా లేదని సమాజంలో మహిళలకు సమాన స్థానం కల్పించాలని కరపత్రాల ద్వారా, మైకింగ్ ద్వారా ప్రచారం చేస్తున్నాం.

ప్రజాశక్తి: పిసిపిఎన్‌డిటి చట్టం అతిక్రమిస్తే ఏమవుతుంది..?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: ఈ చట్టపరిధిలో మొదటిసారి చేసిన తప్పుకు 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా, రెండోసారి చేస్తే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50వేలు జరిమానా అలాగే మూడోసారి ఐదేళ్ల జైలు శిక్ష రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుంది. అలాగే ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ చట్టాన్నా అత్రికమించిన తల్లిదండ్రులు, భర్త, బంధువులు, ఇతర వ్యక్తులకు, వైద్యసంస్థలకు ఈ శిక్షలు వర్తిస్తాయి.

ఆ గ్రామానికి వెళ్లాలంటే..

గుంతలను దాటాల్సిందే..!

- అభివృద్ధికి ఆమడ దూరంలో రామకృష్ణాపురం
- చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారికి కూత వేటు దూరం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, గ్రామస్తులు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం:

ఆ గ్రామానికి వెళ్లాలంటే గుంతలు దాటుకుని పడుతూ.. లేస్తూ వెళ్లాల్సిందే.. రోజూ ఇబ్బందులు పడుతూ ప్రయాణం సాగిస్తామని వాహనాదారులు, గ్రామస్తులు వాపోతున్నారు. స్పందించి న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నారు..

గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ రామకృష్ణాపురం గ్రామం ఉంది. ఈ గ్రామంలో 14 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. అందరూ వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తూన్న రైతులు, వ్యవసాయ కూలీలే.. ఈ గ్రామం నుంచి చిత్తూరు -పుత్తూరు జాతీయ రహదారికీ చేరుకోవాలంటే 1.5 కిలోమీటర్ల దూరం. ఈ గ్రామం నుంచి వెళ్లాలంటే ఈ దారే ప్రధాన మార్గం. ఈ రోడ్డు గతంలో కురిసిన వానలకు కోతకు గురైంది. గచ్చు తేలి చిన్న చిన్న రాళ్లు రోడ్డుపై ఉన్నాయి. ద్విచక్ర వాహనదారులకు ఆ గచ్చురాళ్ళు ముందర చక్రాలకు తగిలి బండిపై నుంచి కింద పడిన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఇక పాదచారులకు అయితే ఆ రోడ్డుపై నడవాలంటే నరకం కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరికాళ్ళకు ఆ రాళ్లు గుచ్చుకుని అలానే నడవాలంటే బాధ వర్ణనాతీతం అని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మర్మత్తులు చేపట్టి దారి బాగుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న రోడ్డు

40 ఏళ్ల సమస్య


బి.ప్రసన్న కుమార్, రామకృష్ణాపురం



మా గ్రామానికి 40 సంవత్సరాలుగా దారి సమస్య ఉంది. బాగు చేయాలని అటు రాజకీయ నాయకులను, ఇటు అధికారులకు వినతులు ఇస్తూ సమస్యలను చెబుతూనే ఉన్నాం కానీ పరిష్కారం చేయడం లేదు. గత వర్షాకాలంలో వృద్ధ దంపతులు ఈ రోడ్డుపై నడుచుకుంటూ ఊర్లోకి వస్తున్నప్పుడు రాళ్ల పాదాలకు తగిలి పడిపోయి ఆసుపత్రి పాలైన సంఘటన చోటుచేసుకుంది. ఇకనైనా మా గ్రామానికి సరైన రోడ్డు వేయండి.

రోడ్డు సమస్య తీర్చండి..

బి.ధనంజేయ నాయుడు, రామకృష్ణాపురం



చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారికి కూత వేటు దూరంలో రామకృష్ణాపురం గ్రామం ఉంది. కానీ గత 40 సంవత్సరాలుగా ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. ప్రతి సంవత్సరం గ్రామస్తులే తలా కొంచెం డబ్బులు పోగేసుకొని మట్టి తోలుకునే రోడ్డు బాగు చేసుకునే దుస్థితి. వర్షం పడితే రోడ్డు కోతకు గురై పోసిన మట్టి కొట్టుకుపోతుంది. ఎన్ని సార్లు అధికారులకు విన్నవించుకున్న సమస్య తీరడం లేదు. అంతేకాదుకనీసం తాగునీరు సౌకర్యం కూడా లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పినా పట్టించుకునే నాథుడే లేరు.

గత వారం స్కూల్ ఆటో బోల్తా పడింది..

బి.మునస్వామి, రామకృష్ణాపురం



మాది రామకృష్ణాపురం గ్రామం. మా గ్రామంలో 14 కుటుంబాలు ఉన్నాయి. గత 40 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోలేదు. వారం కితం రోడ్డు సరిగా లేకపోవడంతో స్కూల్ ఆటో బోల్తా పడింది. తృటిలో ప్రమాదం తప్పి పిల్లలు చిన్నచిన్న గాయాలతో భయటపడ్డారు. ఇకనైనా గ్రామానికి రోడ్డు వేసి దారి సమస్యను పరిష్కరించండి.

భోగి మంటల్లో

విద్యుత్ బిల్లులు తగలబెట్టండి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు పిలుపు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారీగా మోపునున్న విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దగ్ధం చేసే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం చిత్తూరులో సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదనపు విద్యుత్ భారాలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలను యథాతదంగా ఉంచుతున్నట్లు చూపారని అయితే ప్రతి నెలా వసూలు చేస్తున్న 40 పైసలు 2025- 26లో రద్దు చేస్తున్నట్లు స్పష్టంగా ఎక్కడ చెప్పలేదని తెలిపారు. 2025- 26 సంవత్సరంలో ప్రజలపై భారం ఉంటుందని స్పష్టంగా అర్థం అవుతున్నదని, 2025- 26 సంవత్సరానికి రెవెన్యూ గ్యాప్ 5538 కోట్లు చూపించారని తెలిపారు. ఈ మొత్తాన్ని చార్జీల రూపంలో వసూలు చేయాలనేది స్పష్టంగా కనిపిస్తున్నదని ఈ భారం ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. టైం ఆఫ్ డే విధానాన్ని సిపిఎం వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. రోజుకు 24 గంటలలో పీకవర్స్ ఎనిమిది గంటలు ఆఫ్ పీకావర్స్ 11 గంటలు నార్మల్ అవర్స్ 5 గంటలు అని చెప్పి విభజన చేసి సామాన్యులు వాడే సమయంలో కరెంటుకు అదనంగా డిస్కం వసూలు చేయడానికి ప్రతిపాదించడం దారుణం అన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ప్రతిపాదనను రద్దు చేయాలని, టైమ్ ఆఫ్ డే టారీకు విధానాన్ని అమలు చేయటం, చార్జీలు వసూల్లో పారదర్శకత లేకపోవడం ప్రిపైడ్ విధానాన్ని కలిగి ఉండడం తదితర కారణాల రీత్యా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రజలపై భారం పడనున్న విద్యుత్ బిల్లులు తగలబెట్టే కార్యక్రమంలో ప్రజలు ప్రజాసంఘాలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

పుంగనూరు జనసేన నేతలకు పవన్ సూచన



ప్రజాశక్తి- పుంగనూరు: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుంగనూరు జనసేన నాయకుడు, ఎన్విఆర్ ట్రస్ట్ అధినేత వేణుగోపాల్ రెడ్డికి సూచించారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను ఆదివారం విజయవాడలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. పుంగనూరు నియోజకవర్గంలో జరుగుతున్న ప్రస్తుత పరిస్థితులను గురించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వస్తున్న పథకాలను ప్రజలకు అందేలా చూడాలని అన్నారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలంగా ముందుకు తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతంతో పాటు ఇప్పటినుండి క్యాడర్ను కూడా తయారు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలన్నింటినీ ప్రజలకు చెరువ చేయడానికి ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. నియోజకవర్గ నాయకులు శివ కుమార్ రెడ్డి, విరూపాక్ష, చిన్నా రాయల్, నరేంద్ర రెడ్డి, నారయణరెడ్డి, నరేష్ రాయల్, చైతన్య రాయల్, నాగభూషణం, రెడ్డెప్పరెడ్డి, రాఘవ పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్ల ప్రారంభోత్సవం



ప్రజాశక్తి- వెదురుకుప్పం: జీడీ నెల్లూరు నియోజక వర్గ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలో మండల పార్టీ అధ్యక్షులు కామసాని లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో మినీ గోకులం షెడ్లను తెలుగు తమ్ముళ్లు ప్రారంభించారు. పాతగుంట పంచాయతీ, గంటవారిపల్లి పంచాయతీ ముతాలంలో, కురివికుప్పం పంచాయతీ, నల్లవెంగనపల్లి పంచాయతీ, హరిజనవాడ, జక్కదన పంచాయతీ నచ్చుకూరులో గోకులం షెడ్లను ప్రారంభించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్ మురళీ, టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగ ప్రధాన కార్యదర్శి ఎన్.ముని చంద్రారెడ్డి, కోనేరు చెంగలరాయ రెడ్డి, వరప్రసాద్, వెంకటాద్రి నాయుడు, మోహన్ రెడ్డి, చంద్రబాబు రెడ్డి, రాజారెడ్డి, సర్పంచులు శ్రీనాథ రెడ్డి, అబ్బుల్ రెడ్డి పాల్గొన్నారు.

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా నడింపల్లి దామోదర్ రాజు

ప్రజాశక్తి-చౌడేపల్లి: వైసిపి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులుగా చౌడేపల్లి జెడ్పిటిసి నడింపల్లి దామోదర్ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన తిరుపతిలోని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తనపై ఉంచిన విశ్వాసాన్ని నిరూపించుకుంటానని గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి మరింత పటిష్టత చేకూరుస్తానని అన్నారు. మాజీ ఎంపీపీ కూరపర్తి అంజిబాబు, కళ్యాణ్ భరత్, నరసింహ యాదవ్ ఉన్నారు.

యువత మత్తుకు బానిసకావొద్ద..

ప్రజాశక్తి- చౌడేపల్లి: యువత మత్తుకు బానిస కావొద్దని నరేన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ సురేంద్రబాబు అన్నారు. ఆదివారం యువజన దినోత్సవం సందర్భంగా నరేన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానంద స్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజ సేవ కోసం తమ వంతు కృషి చేస్తున్నామని ఇందులో భాగంగా మండలంలోని పాఠశాలలకు విద్య ఉపయోగకర వస్తువులు అందిస్తున్నట్లు వివరించారు. యువకులు మత్తుకు బానిసలుగా తయారవుతున్నారని సమాజంలో ఇలాంటి పోకడలు వల్ల పాడవుతుందన్నారు. ఇలాంటి సమయంలో యువకులు భవిష్యత్తుపై ఆశలు పెట్టుకొని కుటుంబాన్ని పోషించే దిశగా ఆలోచనలు చేయాలన్నారు. ప్రతినిధులు నరేష్, మనీ, అశోక్ పాల్గొన్నారు.

సెలవుల్లో పిల్లల పట్ల జాగ్రత్త వహించండి: ఎస్ఐ

ప్రజాశక్తి- పలమనేరు: పాఠశాలలకు సెలవులు రావడంతో పిల్లల పట్ల తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలని ఎంత పనిలో ఉన్నా సరే పిల్లలపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలని పలమనేరు ఎస్సై స్వర్ణతేజ ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. పిల్లల పట్ల అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాల భారినపడే అవకాశం ఉందన్నారు. పిల్లలను బావుల్లో, చెరువుల్లో ఈత కొట్టేందుకు పంపించొద్దని, ఈత నేర్పించాల్సిన అవసరమైతే తామే స్వయంగా వారికి తోడుగా వెళ్లలని అన్నారు. మైనర్లను బైక్ నడపమని చెప్పొద్దు. పిల్లలకు బైక్ తాళాలు కనిపించకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు వారికి ఇవ్వొద్దు అని, ఇవ్వాల్సిన అవసరం అయితే మీ కనుచూపు మేరలోనే ఉండే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. ఇంట్లో పెద్దలతో పిల్లలు ఎక్కువ సమయం గడిపేలా చూడాలని, వీలైనంత వరకు పిల్లలను ఇంట్లోనే ఉంచుకుని మన సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాలని తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం

రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా హేమావతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా నల్లాటూర్ హేమావతిని నియమిస్తూ జాతీయ అధ్యక్షులు, ఎంపీ రాజ్యసభ ఆర్.కృష్ణయ్య ఆదేశాలు జారీ చేసినట్లు దక్షిణాది రాష్ట్రాల ఇంచార్జీ షణ్ముగం తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో నల్లాటూర్ హేమావతికి నియామకపు పత్రాన్ని అందించారు. బీసీ సంక్షేమ సంఘంలో విశిష్ట సేవలు అందించిన నల్లటూరు హేమావతిని గుర్తించి ఆమెకు రాష్ట్ర మహిళా విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమించడం జరిగిందని షణ్ముగం తెలిపారు.

భారీ లారీతో ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : మండల కేంద్రంలో అసలే ఇరుకైన రోడ్లు.. ఈ దారుల్లోనే తమిళనాడు నుంచి హైదరాబాద్‌కు భారీ కంటైనర్లు వస్తూ పోతూ ఉంటాయి. ఈనేపథ్యంలో ఆదివారం బైరెడ్డిపల్లి గ్రామంలోని సెంటర్ బస్టాండ్ మలుపు వద్ద కంటైనర్ ఇరుక్కుపోవడంతో దాదాపు రెండు గంటలపాటు పలమనేరు –కుప్పం జాతీయ రహదారిలో కిలోమీటరు దూరం వాహనాలు ఆగిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఎస్సై పరుశురాముడు అక్కడి చేరుకుని ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసి క్లియర్ చేశారు.



కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు: సీఐ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని ఎవరైనా ఎక్కడైనా కోడిపందేలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదివారం ఒక ప్రకటనలో సీఐ శ్రీనివాసంతి హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సాంప్రదాయంగా కుటుంబంతో ఆనందోత్సాహంగా జరుపుకోవాలన్నారు.

జూదం ఆడితే శిక్ష తప్పదు: సిఐ

గంగవరం: మండలంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని, గ్రామాలు, గ్రామ శివార్లు, ఇతర ప్రాంతాల్లో కోడి పందేలు, పేకాట, జూదాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని, ఎవరైనా ఈ క్రియాకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా లేదా సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు తోడ్పడినా, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ప్రసాద్ తెలిపారు.

సాంప్రదాయ పద్ధతిలో సంక్రాంతి జరుపుకోండి
రూరల్ సీఐ మల్లేష్ యాదవ్

కుప్పం రూరల్: సంక్రాంతి పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కుప్పం రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. పండుగ సంబరాల చాటున అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. జూదాలు, కోళ్ల పందేలు వంటివి నిర్వహించడం చట్ట వ్యతిరేకమని ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

జోసఫ్ రాజుకు సేవా పురస్కారం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం సంక్రాంతి పురస్కారాలను ఉత్తమ సేవలు అందించిన వారిని సన్మానించి వారికి ప్రశంసా పత్రాలు మెమొంటోను అందజేయడం జరిగింది. నిరాశ్రయులకు సేవలందిస్తున్న జోసఫ్ రాజును ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సేవా పురస్కారం అందించడంతో పాటు సన్మానించారు.

పూర్వ విద్యార్థుల కలయిక




ప్రజాశక్తి- పూతలపట్టు: మండల పరిధిలో గల ఎర్రచెరువుపల్లి ఉన్నత పాఠశాలలో 1977–78 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల కలయిక ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో లంకిపల్లి మహదేవ నాయుడు, అద్దంకి జయరామ నాయుడు, గల్లా రాధాకృష్ణ, మునీశ్వరన్, పివి.గిరి కుమార్, కే.దొరస్వామి నాయుడు, గల్లా రంగనాథం నాయుడు, శేషారెడ్డి, విశ్వనాథరెడ్డి, గంగుల నాయుడు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని బల్లపంచాయితీ పెద్ద కురుబలపల్లి గ్రామంలో టిడిపి కార్యకర్త తిప్పమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న టీడిపి రాష్ట్ర యస్సీ సెల్ ఉపాధ్యక్షులు మునస్వామి, టిడిపి నేతలతో కలిసి ఆమె భౌతికయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.10వేలు కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చులకు గాను అందించారు. నాగభూషణం, ఎర్రప్ప, స్థానిక నేతలు ఉన్నారు.

గురవారెడ్డిని సన్మానించిన సర్పంచ్



ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా ఎస్ఆర్ పురం మాజీ జెడ్పిటిసి పిళ్ళారి కుప్పం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ వైఎస్ఆర్సిపి నాయకుడు గురవారెడ్డి నియమించినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురవారెడ్డిని ఉడమలకుర్తి గ్రామపంచాయతీ సర్పంచ్ చిట్టి మహేష్ ఘనంగా సన్మానించారు. గురువారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఉపాధ్యక్షులు పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, కరుణాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సహాయం



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లి పంచాయతీ మోడల్ కాలనీకి చెందిన సాయికి గత సంవత్సరం డిసెంబర్ నెల 25వ తేదీ బైక్ ఆక్సిడెంట్‌లో ఎడమ కాలు విరిగింది. తిరుపతి రమాదేవి హాస్పిటల్‌లో ఆపరేషన్ అనంతరం ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ, స్టేట్ డైరెక్టర్, జనసేన పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్చార్జి యుగంధర్ పొన్న ఆధ్వర్యంలో జనసేన పార్టీ నాయకులు ఆదివారం పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. నియోజకవర్గ బూత్ కన్వీనర్ యతీశ్వర్ రెడ్డి, చందు, సతీష్, రాఘవ, విజయ్, ఉదయ్ కుమార్, చంద్రమౌళి పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ ఆదేశాల మేరకు మండలంలోని పాతగుంట పంచాయతీలో ఆదివారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం జరిగింది. సీనియర్ నాయకులు కె.ఆనంద రెడ్డి, జి.శంకర్‌రెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఎస్.చిట్టెమ్మ, ఎం.భాస్కర్ రెడ్డి, జి.మునికృష్ణారెడ్డి, ఎం.షణ్ముఖ రెడ్డి, ఎం.జయరామిరెడ్డి, ఏ.యతీశ్వర్, విజయ్‌కుమార్, చెన్నకేశవ రెడ్డి, సిహెచ్.శివ పాల్గొన్నారు.

మా భూముల ఆచూకి చూపండి

ప్రజాశక్తి- విజయపురం: మా డీకేటీ భూముల ఆచూకి చూపాలని మండలంలోని మహారాజపురం ఆది ఆంధ్రవాడ వాసులు రెవెన్యూ అధికారులను వేడుకుంటున్నారు. గ్రావెల్ క్వారీలకు వెంటనే స్పందించే అధికారులు తమకిచ్చిన డీకేటీ పట్టాలకు సంవత్సరాల తరబడి భూములు ఎందుకు చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారుల నిర్మాణం నిమిత్తం సర్వే నెంబరు 1/పీలో అనుమతి తీసుకొని తమకిచ్చిన డీకేటీ భూములు తవ్వేస్తున్నారని, తమకు డీకేటీ భూములు సర్వే చేసి భూములు చూపే వరకు గ్రావెల్ క్వారీని నిలుపుదల చేయాలని కోరుతున్నారు. మండల స్థాయిలో తహశీల్దార్ కోరితే గ్రావెల్ తనకు సంబంధం లేదంటున్నారని, తాము ఎవర్ని సంప్రదించాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రావెల్ తవ్వే వారిని సంప్రదించి సమస్యను వివరించినా వారు పట్టించుకోకుండా మరిన్ని యంత్రాలను దిగుమతి చేస్తున్నారని, తమ గోడు పట్టించుకునేవారు కరువైయ్యారని కంటతడి పెడుతున్నారు.



మహారాజపురంలో గ్రావెల్ తవ్వకానికి దుగుమతి అయిన యంత్రాలు

సంవత్సరాలు తరబడి ఎదురు చూస్తున్నాం..
- నాంచేరమ్మ, మహారాజపురం ఆది ఆంధ్రవాడ



ప్రభుత్వం డీకేటీ పట్టాలు ఇచ్చింది. ఆ భూముల్లో సాగు చేసుకుంటూ మా బతుకులు బాగుపడుతాయని అనుకున్నాము. కానీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో మాకు భూములు చూపకుండా పట్టాలకే పరిమితం చేశారు. అధికారులు మాపై కరుణించండి.

మా బతుకులు మారలేదు
- అనురాధ, మహారాజపురం, ఆదిఆంధ్రవాడ



ప్రభుత్వాలు మారుతున్నాయి. సంవత్సరాలు గడిచి పోతున్నాయి కానీ మా బతుకుల్లో వెలుగు రాలేదు. ప్రతి ఒక్కరూ స్వార్థంతో పని చేసుకుంటూ మమ్మల్ని పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా మాకు న్యాయం జరుగుతుందని ఎదురుచూస్తున్నాం.

కాలుష్య కోరల్లో పరిశ్రమలు

- పట్టించుకోని అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- ఏడవ రోజు కొనసాగిన ఆందోళన

ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు పెరగాలన్న ఆ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నది నేటితరం మాట. పారిశ్రామిక అభివృద్ధి ఎంత అవసరమో అంతకన్నా అన్నదాతలు అయిన రైతులను రక్షించుకోవడం, వ్యవసాయాన్ని కొనసాగించడం, రైతులు పండించిన పంటలను పరిరక్షించుకోవడం అవసరమన్నది పలువురు విద్యావంతులు, సామాజిక కార్యకర్తల మాట. పరిశ్రమలు అభివృద్ధి చెందడం వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడి, రాష్ట్రం ప్రగతి బాట పడుతుంది. పారిశ్రామిక అభివృద్ధి పేరిట వ్యవసాయ రంగం దెబ్బతింటే భవిష్యత్తు తరాలు తినడానికి తిండి లేని పరిస్థితి పడుతుందన్నది జగమెరిగిన సత్యం.

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం నియోజకవర్గ పరిధిలో కాలుష్య కోరాలలో పరిశ్రమలు నిర్వహిస్తున్నారు అంటూ పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కుప్పం తిరుపత్తూరు జాతీయ రహదారికి పక్కనే దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసి వానగుట్టపల్లి, విమిట్టపల్లి పంచాయతీలకు చెందిన రైతులు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. అన్నదాతలు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు ఆదివారం నాటికి ఏడవ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా దీక్ష శిబిరానికి చేరుకున్న రైతులు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయానికి కూలంగా కుప్పం పరిసర ప్రాంతాలలో పరిశ్రమల స్థాపనకు తాము వ్యతిరేకం కాదన్నారు. అయితే పరిశ్రమ నిర్వాహకులు వారి నియమ నిబంధనలకు వ్యతిరేకంగా, పర్యావరణానికి హాని కలిగించేలా నిర్వహించడం బాధాకరమన్నారు. పరిశ్రమ నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా నియమ నిబంధనలకు వ్యతిరేకంగా పనులు చేపట్టడం వల్ల వ్యవసాయ భూములు పంటలకు పనికిరాకుండా పోతోందని, అందువల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తమ గ్రామాల పరిధిలో నిరంతరాయంగా జరుగుతున్న రాతి పరిశ్రమలో చేపడుతున్న పేలుడు వల్ల రాతి అవశేషాలు ఒక రూపంలో మారి రైతులు పండిస్తున్న పంటలను నాశనం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ అధికారులు స్పందించి తమ గ్రామాల పరిధిలో కొనసాగుతున్న రాతి పరిశ్రమలను మరొక్క మారు పరిశీలించి, రైతులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.



దీక్షా శిబిరంలో ఏడవ రోజు నిరసనలో పాల్గొన్న రైతులు

ఘనంగా సంక్రాంతి ముందస్తు వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా రచయితల సంఘం, కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో సంక్రాంతి ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చూడా ఛైర్మన్ కటారి హేమలత ముఖ్యఅతిథులుగా పాల్గొని వివిధరంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి సేవా పురస్కారాలు అందజేశారు. ముందుగా స్థానిక గాంధీ విగ్రహం నుండి గంగిరెద్దుల మేళాలతో, కోలాటం, గొబ్బీ పాటలు, హరిదాసులు వివిధ కళారూపాల కళాప్రదర్శనలతో నాగయ్యా కళాక్షేత్రం వరకు ఊరేగింపు నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణనన్ మనవడు ఈ కార్యక్రమంలో పాల్గొని సంక్రాంతి విశిష్టతను తెలియజేశారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మహిళలతో కోలాటం ఆడి ఉత్సాహపరిచారు. డాక్టర్ రామలక్ష్మి, సౌమినిరెడ్డి, పార్థసారథి నాయుడు, శ్యామలాదేవి, భాస్కర్ రెడ్డి, మునుస్వామి, వికే.మోహన్ తులసీనాథం నాయుడు, ఎంఆర్.అరుణకుమారి, శ్రీనివాసు మూర్తి, సీఎం చంద్రశేఖర్, అశోక్ కుమార్, త్యాగరాజు నాయుడు, నరేంద్ర కుమార్, ప్రేమ, కోదండ రెడ్డి, అరుణ శివప్రసాద్, మునిరత్నం రెడ్డి, డాక్టర్ గంగాధరం పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

కనుమ పండుగ కోసం చిట్లాకుప్ప సిద్ధం

ప్రజాశక్తి- సోమల: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రమైన సోమల సమీపంలోని తిరుపతి రోడ్డులో కనుమ పండుగ రోజు చిట్లాకుప్ప వెలిగించేందుకు సర్వం సిద్ధం చేశారు. పశువుల పండుగను నిర్వహించే కనుమ పండుగ రోజు గ్రామంలోని పశువులను అందంగా అలంకరించి పూజలు చేసి సాయంత్రం వేళలో సోమల సమీపంలోని తిరుపతి రోడ్డులో గల కాటమరాజు ఆలయం వద్ద చిట్లాకుప్ప వెలిగించి అలంకరించిన పశువులను వెలిగించిన చిట్లాకుప్ప చుట్టూ మూడు ప్రదక్షిణలు చేయించి తర్వాత ఇంటికి తోలుకొని రావడం ఆనవాయితీగా వస్తోంది. చిట్లాకుప్ప విశిష్టతను గురించి గ్రామపెద్దలను అడుగగా పశువుల పండుగ రోజు పశువులను పూజించి చిట్లాకుప్ప వద్ద వెలిగించిన చిట్లాకుప్ప అగ్నికీలల చుట్టూ తిప్పడం వల్ల పశువులకు ఎలాంటి వ్యాధులు రావని ఆరోగ్యంగా ఉంటాయని మంచి సంతాన ఉత్పత్తిని పొందుతాయన్న భావన ప్రజల్లో ఉందని అన్నారు. చాలా ఏళ్ల క్రితం పశువులకు వ్యాధులు రావడం చనిపోవడం జరుగుతూ ఉండేవని చిట్లాకుప్ప చుట్టూ పశువులను తిప్పడం వల్ల ఎలాంటి అంటువ్యాధులు సోకకుండా ఆరోగ్యంగా ఉంటాయని రైతులు నమ్ముతారని అందుకే చిట్లాకుప్ప చుట్టూ పశువులను తిప్పడం కాటమరాజు ఆలయం వద్ద పూజలు నిర్వహించి హారతులు ఇవ్వడం చేస్తారని తెలిపారు. చిట్లకుప్ప మండల కేంద్రంలో మూడు ప్రదేశాలలో నిర్వహిస్తారు. రైతులు గ్రామస్తులు అందరూ వెళ్లి ఎండు కొమ్మలు, కట్టెలను పోగు చేసి వాటిని చిట్లాకుప్పగా పేరుస్తారు. ఈ ఏడాది కనుమ పండుగను ఘనంగా జరిపేందుకు గ్రామంలో ప్రజలు రైతులు యువకులు ఉత్సాహంగా ఉన్నారు.



ఎండు కట్టెలను కుప్పగా పేర్చి చిట్లాకుప్ప తయారు చేసిన దృశ్యం

షటిల్ బ్యాడ్మింటన్ విజేతలుగా రాజశేఖర్, సుందర్



పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని నందమూరి తారక రామారావు క్రీడాప్రాంగణంలో నిర్వహించిన షటిల్ బాట్మెంటన్ పోటీలలో రాజశేఖర్, సుందర్ విజేతలుగా నిలిచినట్టు కుప్పం లయన్స్ క్లబ్ సలహాదారు మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఎన్‌వైకేఎస్, యువ భారత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నందమూరి తారక రామారావు క్రీడా సముదాయంలో షటిల్ బాట్మెంటన్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీలలో విజేతలుగా రాజశేఖర్, సుందర్, రన్నర్స్ గ హరీష్, దినకర్ నిలిచారని, వీరిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుప్పం లయన్స్ క్లబ్ సలహాదారు, యువ భారత్ అసోసియేషన్ అధ్యక్షుడు వేకాంత్, జాతీయ సేవా కార్యకర్త పరంధమ, క్రీడాకారులు వెంకటసామీ, శివ రెడ్డి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

బిడ్డలతో తల్లి ఆత్మహత్యాయత్నం

- చిన్నారులు మృతి
- తల్లిని కాపాడిన స్థానికులు

ప్రజాశక్తి- సదుం



మృతిచెందిన చిన్నారులు

అత్తతో గొడవపడి చంటి బిడ్డలను ఓ తల్లి ఉరివేసి చంపిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ షేక్‌షావళి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సదుం టౌన్ మసీదు వీధిలో కాపురం ఉంటున్న షేక్ మన్సూర్ భార్య షేక్ కరిష్మా (27) ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో అత్త గవహర్‌జాన్‌తో గొడవపడింది. అత్తపై కోపంతో తన ఇద్దరు ఆడపిల్లలను తీసుకొని ఇంటి మిద్దెపైన ఉన్న గదిలోకి వెళ్లి గడి పెట్టుకుంది. పిల్లలు షేక్ షిర్ధా(2), షేక్ జర ఫాతిమా(1)లకు వైర్‌తో ఉరివేసింది అనంతరం తన మెడకు ఉరివేసుకుని చనిపోయే ప్రయత్నం చేసింది. కానీ చుట్టుపక్కల వారు గమనించి కరిష్మాను కాపడగా, ఇద్దరు చిన్నారు అప్పటికే మరణించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటోను ఢీకొన్న బస్సు

ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో ఆదివారం వారపు సంత జరిగింది. సోమవారం భోగి పండగ కావడంతో గ్రామంలోని వాళ్ళ ఆటోల్లో వారపు సంతకు వచ్చారు. ఇంటికి కావలసిన సరుకులు కూరగాయలు తీసుకున్నారు. తిరుగు ప్రయాణంలో బస్సు ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. రామచంద్రాపురం మండలం ఎన్ఆర్ కమ్మపల్లి ఆది అరుంధతి వాడ గ్రామానికి చెందిన రమేష్ ఆటోలో ఆ గ్రామస్తులను వారపు సంతకు తీసుకువచ్చాడు. తిరుగు ప్రయాణంలో ఎర్రగుంట గ్రామం దగ్గర ఎదురుగా వస్తున్న బస్సు ఢీ కొనడంతో ఆటో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రమేష్ (32), ప్రయాణికులు మనకంత (28), శ్వేత (27)లు తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు 108 సహాయంతో గాయపడిన వారిని తిరుపతి రుయాకు తరలించారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని గంగినాయనపల్లి పంచాయతీకి చెందిన కొత్త ఇండ్లు బస్‌స్టాప్ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం అమ్ముతున్న సాతాని కృష్ణప్ప (57)ను మండల హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, గణేష్, వేణు అరెస్టు చేశారు. అనంతరం మద్యంను స్వాధీనం చేసుకుని కృష్ణప్పపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

గడ్డివాము దగ్ధం

రూ.20వేలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి- చౌడేపల్లి: మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీ చౌడగానిపల్లిలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాము దగ్ధమవ్వడంతో రూ.20వేలు ఆస్తి నష్టం కలిగింది. పుంగనూరు అగ్నిమాపక కేంద్ర అధికారి సుబ్బరాజు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చౌడగానిపల్లి గ్రామంలో అగ్నిప్రమాదం సంబంధించిన సమాచారం రావడంతో హుటాహుట్టిన గ్రామానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశామని, ఇళ్ల మధ్యనే ఉన్న గడ్డివామి ఉందని సరైన సమయంలో మంటలు ఆర్పడంతో చుట్టుపక్కల ఎలాంటి నష్టం జరగలేదని దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారని తెలిపారు. గ్రామానికి చెందిన ఎం.కళ్యాణికి చెందిన గడ్డివాము పూర్తిగా కాలి బూడిదైందని, ఈ ప్రమాదంలో రూ.20వేల వరకు ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు. పుంగనూరు అగ్నిమాపక సిబ్బంది సుబ్రహ్మణ్యం ప్రసాద్ మోహన్ బాబులు పాల్గొన్నారు.



ఆటోకు నిప్పు పెట్టిన ఆకతాయిలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణం కొత్తపేట సంపంగి నగర్‌లో నివాసం ఉంటున్న జనార్ధన్ నాయుడుకు చెందిన ఆటోకు కొంతమంది ఆకతాయిలు శనివారం అర్ధరాత్రి సమయంలో నిప్పు పెట్టడంతో ఆటో పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత కొంతకాలం క్రితం పట్టణానికి చెందిన కొంతమంది ఆకతాయిలు తమ ఇంటి వద్ద గొడవకు దిగారని ఆ సందర్భంలో వారిని వారించి, తీవ్రంగా హెచ్చరించడం జరిగిందన్నారు. ఈ ఘటనతో తనపై కక్ష పెంచుకున్న ఆకతాయిలు శనివారం అర్ధరాత్రి సమయంలో తన ఇంటి ముందు ఉన్న ఆటోకు నిప్పు పెట్టినట్టు ఆరోపించారు. ఆదివారం తెల్లవారుజాము సుమారు మూడు గంటల ప్రాంతంలో నిద్రలేచిన తాను తగలబడుతున్న ఆటోను గుర్తించినట్టు తెలిపారు. కుప్పం మండలం ఆవులనత్తం గ్రామానికి చెందిన తాను జీవనోపాధి లేక, వేరొకరి ఆటోను అద్దెకు తీసుకొని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఆ ఆటోను ఆకతాయిలు తగలబెట్టడంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పోలీసులు తగు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నారు.



అనాథ శవానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం పట్టణం దలవాయి కొత్తపల్లి ప్రాంతానికి చెందిన మణి ఆదివారం అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. వారం రోజుల క్రితం గుల్లేపల్లి సమీపంలో రైలు కింద పడి ఒక వ్యక్తి మృతి చెందడం జరిగింది. మృతుడి వివరాల కోసం రైల్వే పోలీసులు ఆరా తీయగా ప్రయోజనం లేకపోయిందని తెలిపారు. దీంతో మృతదేహాన్ని వారం రోజులుగా ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచినట్టు తెలిపారు. రోజులు గడిచే కొద్దీ శవాన్ని భద్రపరచడం కష్టతరం కావడంతో డీకేపల్లి మణి సొంత ఖర్చులతో రైల్వే పోలీసులు హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ సుబ్రమణి, 108 సిబ్బంది పలువురితో కలిసి అంత్యక్రియలు నిర్వహించడం జరిగింది.